తల్లుల ఎదురుచూపులు

- గత ప్రభుత్వంలో జూన్‌లోనే అందిన అమ్మ ఒడి
- ఫీజుల కోసం ఒత్తిడి తెస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలు
- తల్లికి వందనం అందితే భారం తీరుతుందంటున్న తల్లిదండ్రులు



కూటమి మ్యానిఫెస్టోలో ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని పేర్కొన్న హామీ (సర్కిల్‌లో)

కంకిపాడు: పాఠశాలలు, కళాశాలలు తెరిచి అప్పుడే రెండో నెల కూడా గడుస్తోంది. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యార్థుల తమకు అవసరమైన పుస్తకాలు, విద్యా సామాగ్రిని అధికస్థం మీద కొనుగోలు చేసుకుంటున్నారు. మరో వైపు ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజులు, పుస్తకాలు తీసుకోవాలంటూ ఒత్తిడి పెంచుతున్నాయి. దీంతో ప్రభుత్వం అందిస్తానన్న తల్లికి వందనం ఎప్పుడిస్తారో? అని ఆశగా ఎదురుచూస్తున్నారు. పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో 38,500 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. వీరు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఒకటి నుంచి పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తున్నారు.

తల్లికి వందనం ఇవ్వరూ...?

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాసంస్థలు ప్రారంభమయ్యే నాటికే 'అమ్మ ఒడి' విడుదల చేసి చదువులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఐదేళ్లలో రూ. 240 కోట్ల మేరకు సొమ్ము నియోజకవర్గం లోని లబ్ధిదారుల ఖాతాకు జమ చేశారు. ఈ దఫా కూటమి ప్రభుత్వం అదేవిధంగా పథకాన్ని అందిస్తుందని తల్లిదండ్రులు భావించారు. కానీ విద్యాసంస్థలు తెరిచి రెండో నెల కూడా గడుస్తుండటంతో తల్లికి వందనం సొమ్ము కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, కిట్లు అందించినా, అవసరమైన విద్యాసామాగ్రి, ఇతర ఖర్చులు, ప్రైవేటు సంస్థల్లో విద్యార్థులు పుస్తకాలు కొనుగోలు, యూనిఫామ్స్, షూస్ అంటూ అనేక ఖర్చులు పడటంతో పేద, మధ్యతరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. మరో వైపు ఫీజుల కోసం అప్పుడే ఒత్తిడి మొదలవ్వడంతో ఆయా వర్గాల బాధ వర్ణనాతీతంగా ఉంది. బడికి వెళ్లే పిల్లలందరికీ తల్లికి వందనం అందించి తమ ఇక్కట్లను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఉయ్యూరు ప్రధాన సెంటర్‌లో హామీ...

ఒక కుటుంబంలో ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకాన్ని వర్తింపచేస్తామని కూటమి హామీ ఇచ్చింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ 7వ తేదీ రాత్రి ఉయ్యూరు ప్రధాన సెంటర్‌లో జరిగిన సభలో టీడీపీ అధినేత, ప్రస్తుత సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలను ప్రకటించారు. ఇందులో భాగంగానే తల్లికి వందనం వర్తింపచేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి చేసిన వాగ్దానాలను విశ్వసించి ప్రజలు వారికి పట్టంగట్టారు.

గన్నవరం నియోజకవర్గంలో..

గన్నవరం: గన్నవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 43,046 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో గన్నవరం మండలంలో 16,495 మంది, ఉంగుటూరు మండలంలో 6,686, బాపులపాడు మండలంలో 11,263, విజయవాడ రూరల్ మండలంలోని తొమ్మిది గ్రామాల్లో 8,600 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 'అమ్మ ఒడి' కింద విద్యా సంవత్సరం ప్రారంభంలోనే నిధులు జమచేసేది. అదే విధంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రతి విద్యార్థికీ రూ. 15 వేలు చొప్పున నగదు జమచేస్తుందని తల్లిదండ్రులు ఎదురుచూపులు చూస్తున్నారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన మార్గదర్శకాల్లో ప్రతి విద్యార్థికి అని కాకుండా ప్రతి తల్లికి రూ. 15 వేలు జమచేస్తామని పేర్కొనడం పట్ల లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు.

"

తల్లికి వందనం త్వరగా అమలు చేయాలి



నాకు ఇద్దరు పిల్లలు. ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. వాళ్లకు అవసరమైన పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్స్‌కు చాలా ఖర్చయ్యింది. ఇద్దరు పిల్లలకూ తల్లికి వందనం ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. హామీ త్వరగా అమలు చేసి తల్లికి వందనం వర్తింప చేస్తే ఫీజులు కట్టి, చదువులకు ఆటంకం లేకుండా చూసుకుంటాం.

– కొండవీటి సరిత, మంతెన, కంకిపాడు మండలం

పేద వర్గాలకు బాసట అవుతుంది



నా ఇద్దరు పిల్లల్లో ఒకరు ప్రభుత్వ పాఠశాలలో, మరొకరు ఇంటర్మీడియట్ విద్య చదువుతున్నారు. తల్లికి వందనం పేరుతో కూటమి ప్రభుత్వం ఇచ్చే పథకం అందరికీ అవసరం. హామీ అమలు చేస్తే పేద, మధ్యతరగతి వర్గాలకు బాసట అవుతుంది. పిల్లల చదువులకు ఇబ్బంది ఉండదు. చదువులు సాఫీగా సాగుతాయి. ప్రభుత్వం తల్లికి వందనం అమలు చేసి పేదలకు అండగా నిలవాలి.

– కె.లీలాదేవి, కంకిపాడు

ఆర్థికంగా ఆదుకోవాలి



మేము వ్యవసాయ కూలీగా జీవనోపాధి పొందుతున్నాం. నాకు బడికి వెళ్లే ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా కుటుంబంలోని బడికి వెళుతున్న ప్రతి ఒక్కరికి రూ. 15వేలు ఇస్తామని చెప్పారు. దీంతో మా ఇద్దరి పిల్లలకు రూ. 30వేలు వస్తాయి. గత ప్రభుత్వం ఒక పథకం పేరుతో విద్యా సంవత్సరం ప్రారంభంలోనే రూ. 15వేలు బ్యాంకు ఖాతాలో జమచేసేది. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం డబ్బులు ఇంకా ఇవ్వలేదు. ప్రభుత్వం త్వరగా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేసి ఆర్థికంగా ఆదుకోవాలి.

– అర్.శ్రీలత, కొయ్యగూరపాడు, ఉంగుటూరు మండలం

ఆశగా ఎదురు చూస్తున్నాం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తల్లికి వందనం పేరుతో ఎంత మంది బడి పిల్లలు ఉంటే అంత మందికి ప్రతి ఏటా చదువుకునేందుకు రూ. 15వేలు తల్లుల ఖాతాలో జమచేస్తామని చెప్పారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి ఏటా పాఠశాలలు ప్రారంభానికి ముందే అమ్మ ఒడి పథకం కింద నగదు జమ చేయడం జరిగేది. ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభమైనా ఇంతవరకు తల్లికి వందనం నగదు జమ కాలేదు. నగదు ఎప్పుడు బ్యాంకు ఖాతాలో జమ అవుతుందా అని ఆశగా ఎదురు చూస్తున్నాం.

– షేక్ సైదాబీ, నున్న గ్రామం

సకాలంలో జమచేయాలి



నా ఇద్దరి పిల్లలు గన్నవరం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో చదువుతున్నారు. గతంలో అమ్మఒడి కింద నగదును స్కూల్స్ ప్రారంభించే ముందే బ్యాంక్ ఖాతాలో జమచేసేవారు. ఆ డబ్బుతో పిల్లలకు అవసరమైన సదుపాయాలను సమకూర్చేవాళ్లం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అమ్మకు వందనం పేరుతో ప్రతి విద్యార్థికి రూ. 15 వేలు ఇస్తామని చెప్పింది. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు అవుతుంది. ఇంకా డబ్బులు వేయలేదు. సకాలంలో డబ్బులు వేస్తే పిల్లల చదువులు, పోషకాహారం వంటి ఖర్చులకు ఉపయోగపడుతుంది.

– దాని శాంతకుమారి, గన్నవరం

తల్లికి వందనంతో చదువులకు ఇబ్బంది ఉండదు



నాకు ఇద్దరు సంతానం. ఇద్దరూ ప్రైవేటు పాఠశాలలోనే చదువుతున్నారు. నా భర్త పెయింటర్. అద్దె ఇంట్లో ఉంటున్నాం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి వచ్చింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఇద్దరు పిల్లలకూ తల్లికి వందనం ఇస్తామంటున్నారు. పెరుగుతున్న ఖర్చులతో ఇంటి నిర్వహణ కష్టంగా మారుతోంది. తల్లికి వందనం తో ఇద్దరికీ డబ్బులు ఇస్తే చదువులకు ఇబ్బంది లేకుండా పోతుంది. తల్లికి వందనం కోసం ఎదురుచూస్తున్నా.

– పాతిమున్నీసా, ఉయ్యూరు పట్టణం

ఇద్దరు పిల్లలకు కలిపి రూ. 30 వేలు వస్తాయి



ఎన్నికల్లో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ. 15 వేల చొప్పున అమ్మకి వందనం పథకం కింద ఇస్తామని చెప్పిన హామీని ఎంతో విశ్వసించాం. నాకు ఇద్దరు ఆడ పిల్లలు. పెద్ద కూతురు ఆరో తరగతి, చిన్న కూతురు నాల్గో తరగతి చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇద్దరు పిల్లలకు కలిపి అమ్మకు వందనం కింద రూ. 30 వేలు వస్తాయని ఎదురు చూస్తున్నాను.

– తొమ్మండ్రు రాణి, వేలేరు, బాపులపాడు మండలం

స్కూలు ఫీజు కట్టాల్సి ఉంది



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికే తల్లుల బ్యాంకు ఖాతాల్లో అమ్మ ఒడి పథకం కింద నగదును జమచేసేది. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ పథకం పేరు మార్చి 'అమ్మకు వందనం' పథకం పేరుతో రూ. 15 వేలు ప్రతి విద్యార్థికి ఇస్తామని చెప్పారు. ఇంకా అమ్మకు వందనం కింద నగదు జమ చేయలేదు. ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్న నా కుమారుడికి ఫీజు కట్టేందుకు అమ్మకు వందనం నగదు రూ. 15 వేలు కోసం ఎదురు చూస్తున్నా.

– వి.మౌనిక, పెరికీడు, బాపులపాడు మండలం

"

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



విజయవాడరూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాష్ట్ర వైఎస్సార్ సీపీ వైద్య విభాగం మాజీ అధ్యక్షుడు డాక్టర్ కె.శివభరత్ రెడ్డి, విజయవాడరూరల్ మండల పార్టీ నాయకుడు దుడు సుబ్రహ్మణ్యం రాజు గురువారం తాడేపల్లి పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీ అండగా ఉంటుందని వైఎస్ జగన్ అన్నారని సుబ్రహ్మణ్యం రాజు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గన్నవరం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్య నిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఐటీఐ కళాశాల రోడ్డు, శేషామం గార్డెన్, ఆగిరిపల్లి రోడ్డు, బీసీ గూడెం, చిక్కవరం, గోపవరపుగూడెం, స్టేట్ హాస్పిటల్ ఏరియా, గొల్లనపల్లి, చిక్కవరం శివారు శ్రీ బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు నున్న వికాస్ కాలేజీలో జాబ్ మేళా

నున్న(విజయవాడరూరల్): నున్న వికాస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వికాస్ విద్యా సంస్థల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.కె షరీఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో జియో, అమెజాన్, అపోలో ఫార్మసీ, డిబాబాలీ, టీం యూజ, టెక్నోపాస్క్, జస్ట్ డయల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలియజేశారు. 2022, 2023, 2024 సంవత్సరాల్లో ఏదైనా డిగ్రీ, బీటెక్, బీ ఫార్మసీ, డి ఫార్మసీ, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులు పాల్గొనవచ్చని సూచించారు. ఇతర వివరాల కోసం 9490888445, 9492562636 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

నూర్‌బాషా ముస్లిం సంఘం ప్రధాన కార్యదర్శిగా కాశింబి



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ నూర్ బాషా ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షేక్ పెద్ద కాశింబీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మైలవరం నియోజకవర్గానికి చెందిన తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించినందుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఏ బాజీకి కృతజ్ఞతలు తెలిపారు. నూర్ బాషా సామాజికవర్గానికి చెందిన మహిళల సమస్యలను మైనార్టీల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి నూర్ బాషా సామాజిక వర్గానికి చెందిన మహిళల సమస్యలను తెలుసుకుని ఆధ్యక్షుడి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు షేక్ మీడియా ఇన్‌ఛార్జ్ డి.హుస్సేన్ ఆమెను అభినందించారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్యూర్ అండగా నిలుస్తుంది



భవానీపురం(విజయవాడపశ్చిమ): పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్ (ప్యూర్) స్వచ్ఛంద సంస్థ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, సాధికారత కోసం పని చేస్తోందని సంస్థ సీఈఓ శైలా తాళ్లూరి (యూఎస్‌ఏ) అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం ఫెర్రీలోని ప్రభుత్వ భవిత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని అత్యవసరాల పిల్లలకు 36 అత్యాధునిక చక్రాల కుర్చీలు, ఆటాక్ డెమోడ్, ఆటిజం, సెరిబ్రల్ పాల్సీ పిల్లలకు 3 ప్రత్యేక కుర్చీలు, 10 వినికిడి పరికరాలను, అలాగే హనుమాన్ జంక్షన్‌లోని జీఎమ్‌జీ సెరెనా హోమ్‌కు శైలా తాళ్లూరి 20 బంకర్ బెడ్‌లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఆర్థికంగా ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ డెప్యూటీ డైరెక్టర్, స్పెషల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. ఉమామహేశ్వరరావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్మన్ బీవీఎస్ కుమార్ మాట్లాడారు. మండల అధికారి పుష్పలత, అన్నపూర్ణ, అధ్యాపకులు చంద్రావతి పాల్గొన్నారు.

రాయితీపై బియ్యం, కందిపప్పు



గన్నవరం: స్థానిక రైతుబజార్‌లో రాయితీపై బియ్యం, కందిపప్పు విక్రయాలు గురువారం ప్రారంభమయ్యాయి. దీనికోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌ను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని రైతుబజార్‌లో రాయితీపై బియ్యం, కందిపప్పును ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. పౌరసరఫరాల శాఖ ద్వారా స్టీమ్డ్ బియ్యం రూ. 49, పచ్చి బియ్యం రూ. 48, దేశవాళీ కందిపప్పు రూ. 160లకే అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు, పడమట రంగారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ కోటగిరి వరప్రసాద్, జనసేన నాయకులు చలమలశెట్టి రమేష్‌బాబు, టీడీపీ నేతలు జాస్తి వెంకటేశ్వరరావు, దయాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూన్నాళ్ల ముచ్చటగా మోటార్లు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో టీడీపీ నాయకులు పోలవరం కాల్వపై ఏర్పాటు చేసిన మోటార్లు మూన్నాళ్ల ముచ్చట అయ్యింది. గ్రామంలో ఎర్రచెరువు, పుల్లయ్య చెరువు, జంగమయ్య చెరువులకు మోటార్ల ద్వారా నీరు అందించి చెరువులను నింపడం వల్ల ఆ చెరువుల ఆయకట్టు వ్యవసాయ భూములకు సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో మోటార్లను ఏర్పాటు చేయడం జరిగింది. అయితే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవిన్యూ అధికారులు పోలవరం కాల్వపై నీరు లిఫ్ట్ చేసే మోటార్లను తొలగించారు. ఐరిష్ నీటిని అవసరమైన సాగు నీరు చెరువుల ద్వారా వ్యవసాయ భూములకు వస్తాయని ఆశతో ఎదురుచూసిన రైతులకు నిరాశే మిగిలింది.

వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలని ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జలదూత్ క్యాంపెయిన్-2024 కార్యక్రమంలో భాగంగా అవగాహనా ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రపంచంలో నీరు అత్యంత విలువైనదని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే నీటి ప్రాధాన్యతను గుర్తించాలని సూచించారు. నీటి వృథాను అరికట్టటంతో పాటు వర్షపునీటిని వినియోగించుకునేలా చర్యలుతీసుకోవాలన్నారు. అనంతరం వర్షపునీటి కాపాడుకోవాలని నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కేవీఎస్ ప్రసాద్, సురేష్, మల్కాద్రి, బీబీ, లక్ష్మీజానకి, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పీహెచ్‌సీ సిబ్బంది

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. జనాభా నియంత్రణ ఆవశ్యకత, జనాభా పెరుగుదలతో కలిగే ఇబ్బందులను వివరిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి ఎంటీ మంజూష మాట్లాడుతూ గర్భధారణ, బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం ఉండేట్లు అవగాహన కల్పించారు. తల్లి, బిడ్డ శ్రేయస్సు కోసం పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలు, జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, సీహెచ్‌ఓ ఫణికుమార్, హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, పలువురు ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రక్షిత తాగునీటిని వినియోగించాలి


వీరవల్లిగూడెంలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, సిబ్బంది

గన్నవరం రూరల్: రక్షిత తాగునీటిని ప్రజలు వినియోగించాలని ఆత్కూరు పీహెచ్‌సీ డాక్టర్ బి.మనోహర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన ఆదేశాల మేరకు హెల్త్ సూపర్‌వైజర్ అంకారి నాగమల్లేశ్వరరావు, వైద్య సిబ్బంది వీరపనేనిగూడెం గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సరఫరా అవుతున్న తాగునీటి ట్యాంకుల నుంచి వాటి మాదిరులను తొలగించి పరిశుభ్రత చర్యలు పరిశీలన చేశారు. క్లోరినేషన్ రికార్డులు పరిశీలించారు. గ్రామంలో వాటర్ పైప్ లైన్ లీకేజీలు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. గ్రామంలో సీహెచ్‌ఓ శ్యామల, ఏఎన్‌ఎం అనిత, ఆశా వర్కర్లు సునీత, వాణి, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించండి

వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఏ. మహేష్


నీటి నమూనాలను పరిశీలిస్తున్న వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ మహేష్

పటమట(విజయవాడతూర్పు): నగర వాసులకు తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్య లేకుండా అధికారులు ప్రతి నిత్యం పర్యవేక్షించాలని వీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ ఏ.మహేష్ ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా గురువారం ఆయన చిట్టినగర్ బూస్టర్ పంప్ హౌస్, కేఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్, 56వ డివిజన్, ఏపీ ఐఐసీ కాలనీ లో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. చిట్టినగర్‌లోని బూస్టర్ పంప్‌ను పరిశీలించి, నీటి సరఫరా అవుతున్న కనెక్షన్లు, కొండ ప్రాంతాల్లో లీకేజీ సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన కేఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్‌లో నీటి శుద్ధికి తీసుకుంటున్న జాగ్రత్తలు, సరఫరాలో ఎదురయ్యే సమస్యలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. 56వ డివిజన్‌లో ఇంటింటిలో నీటి నమూనాలను సేకరించి క్లోరిన్ పరీక్షలను నిర్వహించారు. నీటి సరఫరా చేసే ప్రాంతాల్లో తాగునీటి కలుషితం లేకుండా నిరంతరం పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు పటిష్టంగా పర్యవేక్షణ చేస్తూ సైడ్ డ్రెయిన్లలో తాగునీటి పైపులు కలవకుండా అసిస్టెంట్ ఇంజినీర్లు జూలై 20వ తేదీ నాటికి వాటిని గుర్తించి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అలాగే ప్రతి ఇంటి నుంచి చెత్త, డీఆ స్థాయిలో నమూనాలను సేకరించాలని, సేకరించిన నీటి నమూనాల పరీక్షను సీఈ డ్రువీకరించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత డ్రెయిన్లలో తాగునీటి పైపులైన్లు కనిపిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయన ఏపీఐఐసీ కాలనీలో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వాహణ ఎప్పటికప్పుడు చక్కబెట్టాలని నిర్వహించాలన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, డ్రెయిన్లలో ఎప్పటికప్పుడు సిల్టును తొలగించాలని ఆదేశించారు. కమిషనర్ వెంట చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ -1 ప్రసాద్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ -1 డాక్టర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

14న ఉచిత వైద్య శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రభ కాలనీ నందమూరినగర్‌లో ఫ్యామిలీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత్‌శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ సైరాభానుపాల్గొని వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అందులో భాగంగా మధుమేహం, షుగర్ పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఈసీజీ చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రజనీకాంత్‌శర్మ కోరారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలను నివారించండి


మాట్లాడుతున్న ఏడీసీపీ ప్రసాద్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యువతరం ట్రాఫిక్ రూల్స్‌ను పాటించి, ప్రమాదాలను నివారించాలని విజయవాడ పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ(ట్రాఫిక్) డి.ప్రసాద్ తెలిపారు. విజయవాడ సిటీ పోలీసు, కాకరపర్తి భావనారాయణ కళాశాల, మండల న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ డీసీపీ ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువత అత్యధికంగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని, యువత ట్రాఫిక్ రూల్స్‌ను పక్కనపెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరించటం వలన తమ విలువైన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లో 15 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన యువకులే అత్యధికంగా ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. దానివలన ఆ కుటుంబంలోని తల్లిదండ్రులు మనోవ్యధను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలన్నారు. ద్విచక్రవాహనదారులు నాణ్యత కలిగిన హెల్మెట్‌ను వినియోగించాలన్నారు. హెల్మెట్ వాడకపోవడం వలన సగానికిపైగా మరణాలు సంభవిస్తున్నాయని గుర్తు చేశారు.

చట్టాలు మరింత కట్టుదిట్టం..

మండల లీగల్ సర్వీసెస్ కమిటీ లీగల్ సర్వీసెస్ ఆఫీసర్ పి.రాము మాట్లాడుతూ.. మోటారు వెహికల్‌కు సంబంధించి నూతన చట్టాలను మరింత కట్టుదిట్టం చేశారన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన చట్టాలను అతిక్రమిస్తే భారీ జరిమానాలను విధిస్తున్నారు. ఏసీపీ వెస్ట్(ట్రాఫిక్) బి.జనార్ధనరావు మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను పాటించటం ద్వారా సమాజానికి మేలు చేసినవారవుతారన్నారు. నిబంధనలను పాటించి ప్రమాదాలను నివారించాలని సూచించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అధ్యక్షత వహించారు. ట్రాఫిక్ సీఐలు బి.వెంకటేశ్వరరావు, ఆర్.సూర్యభాస్కర్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు ఎస్.సాంబశివరావు, డి.పవన్‌కుమార్, కల్చరల్ ఏం, ఎన్‌సీసీ ఆఫీసర్ టి.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ జ్యోతి పాలిటెక్నిక్
Estd.: 2013
కలవపాముల, ఉయ్యూరు మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-521 164.
కౌన్సెలింగ్ కోడ్ : JPKP
❖ ఆఖరి దశ పాలిసెట్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్స్ మార్చుకొనుటకు ది. 11-07-2027 నుండి ది. 14-07-2024 వరకు అవకాశం కలదు.
❖ మొదటి దశలో లభించిన సీటు / కాలేజీతో మీరు సంతృప్తి చెందనిచో - JPKP లో సీటు కొరకు ఆప్షన్ నమోదు చేయండి.
❖ Polycetలో Qualify కాని వారు మరియు వ్రాయని విద్యార్థినీ విద్యార్థులు నేరుగా అడ్మిషన్ పొందవలెను.
❖ ఫోన్: 63047 32269, 80969 51451, 88779 29999
❖ కోర్సులు : AI & ML, CCBD, CME, ECE, EEE & MEC

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com